
Visit us @ http://epaper.suryaa.com

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

నిజామాబాద్
కామారెడ్డి

శనివారం, 25 మే 2024, పేజీలు : 3



## మండల వ్యవసాయ అధికారిని నిలదీసిన మాజీ జెడ్పిటిసి.



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 24, సూర్య మేజర్ న్యూస్ :** కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని సహకార సంఘాలకు ఇంతవరకు జిలుగు, పెద్దజనుము విత్తనాలు ఎందుకు రాలేదని మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి ని మాజీ జెడ్పిటిసి పడిగెల రాజేశ్వరరావు శుక్రవారం కలిసి నిలదీశారు. పలువురు రైతులతో కలిసి పద్మాజివాడి సహకార సంఘానికి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా రైతులకు అవసరమైన జిలుగు, పెద్ద జనుము విత్తనాలు ఎప్పుడు వస్తాయని అడిగారు. ఇప్పటికే కొన్ని మండలాల్లో ఇస్తున్నారని మన మండలంలో ఎందుకు రాలేవని ప్రశ్నించారు. దీంతో వ్యవసాయ అధికారి తాను వెయ్యికింటల్లా జీలుగు, 850 కింటాలు పెద్ద జనుము విత్తనాలకు ఆర్డర్ పెట్టామని, ఇప్పటివరకు 48 కింటల్లా జిలుగు మాత్రమే వచ్చాయని మిగతా విత్తనాలు సోమవారం వరకు వస్తాయని, వచ్చిన వెంటనే పంపిణీ ప్రారంభిస్తామని సమాధానమిచ్చారు. ఇలా అయితే రైతుల పరిస్థితి ఏమిటని జిలుగు పెద్ద జనుము వేసుకునే సమయం వచ్చిందని సమయానికి విత్తనాలు అందుబాటులో ఉండకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే విత్తనాలు రావడం ఆలస్యం అవుతుంది అని, గతంలో కెసిఆర్ ప్రభుత్వం సమయంలో అన్ని విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తాను సకాలంలోనే విత్తనాలు కావాలని పై అధికారులకు నివేదిక అందజేశామని దశలవారీగా పంపిణీ చేస్తున్నారని మీకు కావాలంటే ఇప్పుడే ఫోన్ లో మాట్లాడుతాను అని అధికారికి ఫోన్ లో మాట్లాడారు.. జిల్లా అధికారులు మరో రెండు రోజుల్లో విత్తనాలు వస్తాయని ఎలాంటి ఆందోళన చెందవద్దని సమాధానం ఇవ్వడంతో రైతులు శాంతించారు.

## చోరీకి పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

**రాజంపేట, మే 24, సూర్య మేజర్ న్యూస్ :** వ్యవసాయ భూముల్లో బోరు మోటర్ల చోరీకి పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు రాజంపేట ఏఎస్ఐ గంగారెడ్డి తెలిపారు. గత కొంతకాలంగా తలమడ్ల రోడ్డు హనుమాన్ ఆలయం పరిసరాల్లోని వ్యవసాయ భూముల్లో నుంచి బోరు మోటర్లు, ఇతర సామాగ్రి చోరీకి గురవుతుండడంతో రైతులు బుధవారం రాత్రి గస్తీ చేపట్టి ఇద్దరిని పట్టుకొని పోలీస్ స్టేషన్లో అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్ఐ గంగిరెడ్డి తెలిపారు.

## విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ లను సకాలంలో అందించాలి. : కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



**ఉమ్మడి జిల్లా బ్యూరో, సూర్య మేజర్ న్యూస్, మే 24 :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ లను సకాలంలో అందించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. స్కూల్ యూనిఫామ్ లను కుట్టే బాధ్యతలను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించగా, డిచ్పల్లిలోని మహిళా శక్తి కుట్టు కేంద్రాన్నీ కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. ఈ కేంద్రంలో కొనసాగుతున్న యూనిఫామ్ ల తయారీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని జతల యూనిఫామ్ లను సిద్ధం చేశారు, ఇంకా ఎన్ని జతలు కుట్టాల్సి ఉంది, క్లాత్ మెటీరియల్ అందుబాటులో ఉందా, ప్రతిరోజూ సగటున ఎన్ని యూనిఫామ్ లను తయారు చేస్తున్నారు తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు పునః ప్రారంభం కావడానికి ముందే యూనిఫామ్ లు ఆయా బడులకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులందరికీ స్కూల్ యూనిఫామ్ లు అందించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు కొలతలకు అను గుణంగా నాణ్యతతో యూనిఫామ్ లు కుట్టేలా పర్యవేక్షణ జరపాలని, నిర్దిష్ట గడువులోగా తయారీ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలన్నారు. యూనిఫామ్ల తయారీకి సంబంధించిన ప్రగతి నివేదికలను తనకు రోజువారీగా అందించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్డీఓ సాయాగౌడ్, డీఈఓ దుర్గాప్రసాద్, ఏపీడీ రవీందర్, ఎపిఎం రజిత తదితరులు ఉన్నారు.



## జిల్లా ప్రజలు సౌమ్యులు : కలెక్టర్ జితేష్ వి పాటిల్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 24, సూర్య మేజర్ న్యూస్ :** కామారెడ్డి జిల్లా వ్యవసాయ ఆధారిత ప్రాంతమని, ఇక్కడి ప్రజలు ఎంతో సౌమ్యులని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో అమలవుచున్న వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలుతీరు, ప్రజాభిప్రాయం, ప్రజా సమస్యలపై అధ్యయనం చేయుటకు జిల్లాకు వచ్చిన (27) మంది కేంద్ర సెక్రెటరియేట్ బృందం తో శుక్రవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో కలెక్టర్ అన్నారు. మానవ వనరుల అభివృద్ధి ఆధ్వర్యంలో వివిధ మంత్రిత్వ శాఖలో పనిచేస్తున్న అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం ఈ నెల 20 నుండి 24 వరకు ఐదు రోజుల పాటు జిల్లాలోని పద్మాజివాడ, శివాయిపల్లి, నర్సన్నపల్లి, దోమకొండ, ఫరీద్ పేట గ్రామాలలో అమలు జరుగుచున్న పలు కార్యక్రమాలను నిశితంగా అధ్యయనం చేసి సందేహాలను ప్రస్తావించడంపట్ల కలెక్టర్ ప్రశంసించారు. బృందం ఐదు రోజుల పాటు పాఠశాలలు,డిజిటల్ తరగతులు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామీణ ఉపాధి హామీ పనులు, స్వయం సహాయక బృందాల పనితీరు, ఆసుపత్రులు, విద్యుత్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, రేషన్ కార్డులు, భూ సమస్యలు, అంతర్గత రహదారులు తదితర అంశాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యక్రమాలను లోతుగా అధ్యయనం చేయడం ద్వారా ఎక్కడ లోటు పాట్లు ఉన్నాయో గుర్తించి ఇంకా పటిష్టంగా అమలు చేయడానికి వీలవుతుందన్నారు. అట్టి కార్యక్రమాలు మారుమూల గ్రామీణ ప్రాంతాలకు చేరిన నాడే పథకాలకు సార్థకత, నిజమైన అభివృద్ధి జరిగినట్లని అన్నారు. పాఠశాలలో మంచినీరు, విద్యుత్, టాయిలెట్స్, చిన్న చిన్న మరమ్మత్తులు వంటివి చేపడుతున్నామన్నారు. విద్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాలలో సోలార్ ప్యానల్ ల ఏర్పాటుపై అధ్యయనం చేస్తున్నామన్నారు. గ్రామ సభల ద్వారా పారదర్శకంగా రెండు పడకల ఇండ్ల కేటాయింపు, వివిధ రకాల పింఛన్లు అందజేస్తున్నామన్నారు. ప్రతి కార్యక్రమం డబ్బుతో ముడిపడి ఉంటుందని, చాలా జాగ్రత్తగా కార్యక్రమాలు అమలు చేయవలసి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ డిఓ చందర్, ఉమ్మడి జిల్లా హెచ్.ఆర్.డి. డా. వసుంధర పాల్గొన్నారు.





## అదనపు వరకట్నం తేవాలని

# అత్తింటి వారి వేధింపులు...!

**పోలీస్ స్టేషన్లో భార్య ఫిర్యాదు.**

**ఎల్లారెడ్డి, 24 మే సూర్య మేజర్ న్యూస్**

ఎల్లారెడ్డి మండల పరిధిలోని అడవిలింగాల గ్రామానికి చెందిన బోరంచ లక్ష్మికి నాలుగు సంవత్సరాల క్రితం నాందేడ్ కు చెందిన దండెం వినోద్ తో వివాహం జరిగింది. కొన్ని రోజుల నుంచి తన భర్త వినోద్, అత్త సరస్వతి, ఆడపడుచు జ్యోతి, ఆడపడుచు భర్త సంజీవ్ లు అదనపు కట్నంగా ఒక లక్ష 30 వేల రూపాయలు తీసుకురావాలంటూ తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని బాధితురాలు బోరంచ లక్ష్మి ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేశామని ఎస్సై బొజ్జ మహేష్ తెలిపారు.

## మహిళా గ్రామ సంఘాల బహిర్గత ఆడిట్

**బిక్కనూర్, మే 24, సూర్యా మేజర్ న్యూస్** : మండలంలోని మహిళా సంఘాలతో నడుస్తున్న గ్రామ సంఘాల పుస్తకాలను, కరీంనగర్ జిల్లాకు చెందిన చార్టెడ్ అకౌంటెంట్ బృందం శుక్రవారం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో గ్రామ సంఘాల ఆర్థిక లావాదేవీలను ఆడిట్ చేశారు. ఈ సందర్భంగా గత సంవత్సరపు ఏప్రిల్ నుండి ఈ సంవత్సరం మార్చ్ వరకు జరిగిన లావాదేవీల వివరాల పుస్తకాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆడిట్ సభ్యులు మహిళా సమాఖ్య సంఘ సభ్యులకు మాట్లాడుతూ సమైక్య ద్వారా మహిళలకు ఇచ్చిన రుణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమైక్యకు సంబంధించి ఆర్థిక లావాదేవీలను ఎప్పటికప్పుడు ఆన్లైన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ సభ్యులురవి రాజ్, కిరణ్, పవన్, ఐకెపి ఎపిఎం శ్రీనివాస్, మండల సమైక్య అధ్యక్షురాలు రాజమణి, కార్యదర్శి విజయ, కోశాధికారి గంగ లక్ష్మి, వివో ఏలు, కంప్యూటర్ ఆపరేటర్, ఐకెపి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ చివరి దశ

**బీబీపేట్, మే 24, సూర్య మేజర్ న్యూస్:**

బీబీపేట్ మండలంలోని శుక్రవారం నాడు ఉప్పరిపల్లి , యాడారం, ఇస్సానగర్ లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ వి పాటిల్ సందర్శించి కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను, ధాన్యం కుప్పలను, తేమ శాతాన్ని పరిశీలించారు. రైతులను పలకరించి కొనుగోలు కేంద్రాలలో ఏమైనా ఇబ్బందులున్నాయా? ధాన్యానికి ఏమైనా తరుగు తీస్తున్నారా అని రైతులను ప్రశ్నించగా, అలాంటి దేమీలేదని సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లారీల తాజా స్థితిని మానిటరింగ్ చేసుకుంటూ కేంద్రాలను అవసరమైన లారీలను పంపి మిల్లులకు ధాన్యం చేర వేస్తున్నామన్నారు. ఇంకా 18 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిగిలి ఉందన్నారు. ప్రధానంగా బీబీపేట్, బిక్నూర్ , దోమకొండ మండలాలలో ధాన్యం రాసులు ఎక్కువగా ఉన్నాయని, అధికారులను అప్రమత్తం చేస్తూ నాలుగైదు రోజుల్లో కొనుగోళ్ల ప్రక్రియ పూర్తిచేస్తామన్నారు. వర్షాలు పడే సూచనలున్నందున రాత్రి పొద్దుపోయేవరకు కూడా ధాన్యం సేకరణ వేగవంతంగా చేయాలనీ నిర్వాహకులకు సూచించారు. కేంద్రాలలో తూకం వేసి ఉంచిన ధాన్యపు బస్తాలను వెంటనే లోడింగ్ చేసి మిల్లులకు తరలించాలన్నారు. కల్లాలలో ఉన్న ధాన్యాన్ని వెంటవెంటనే తూకం వేసి అవసరమైన లారీలను తెప్పించుకొని ధాన్యం లోడ్ చేసి మిల్లులకు పంపాలని, ఎటువంటి జాప్యానికి తావివ్వద్దని అన్నారు. వాతావరణ



పరిస్థితుల పట్ల రైతులకు ఎప్పటికప్పుడు సమాచారమందిస్తూ అప్రమత్తం చేయాలని, ధాన్యం తడవకుండా వారు తగు జాగ్రత్తలు తీసుకుంటారని అన్నారు. రైస్ మిల్లర్లు కూడా అన్ లోడింగ్ పాయింట్లను ఎక్కువ పెట్టుకొని వచ్చిన లారీలు వేచి ఉండకుండా త్వరితగతిన దించుకొని తిరిగి కొనుగోలు కేంద్రాలకు పంపాలన్నారు. కాగా జిల్లాలో ఇప్పటి వరకు 50 వేల మంది రైతుల నుండి రూ . 642 కోట్ల విలువ గల 2,91,475 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాలో రూ . 571 కోట్లు జమ చేశామన్నారు. 288 కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లు పూర్తయిందని, మరో 62 కేంద్రాలు కొనసాగుతున్నాయని కలెక్టర్ వివరించారు.

# వెంచర్లు... 10 శాతం లేఅవుట్లో అక్రమాలు...

**బాన్సువాడ, సూర్య మేజర్ న్యూస్, మే 24 :**

గత కొన్నేళగా మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది, టౌన్ ప్లానింగ్ అధికారులు కుమ్మక్కై బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని వెంచర్లు ఏర్పాటు చేసుకోవడానికి అధికారులు అక్రమాలకు తావు కల్పించడమే కాకుండా, వెంచర్లు ఏర్పాటు చేసుకున్న వారి నుంచి పది శాతం భూమిని మున్సిపాలిటీ పరిధిలోకి తీసుకోవాల్సి ఉండగా, 2020 నుంచి ఇప్పటివరకు ఎన్ని వెంచర్లు వేశారు, ఎక్కడెక్కడ 10 శాతం భూమి ఉందని, తమకు అధికారులు చూపడం లేదని బాన్సువాడ మున్సిపాలిటీ చైర్మన్ జంగం గంగాధర్ తో పాటు కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ కు లిఖిత పూర్వకంగా శుక్రవారం ఫిర్యాదు చేశారు. వెంచర్లు, 10 శాతం భూమి మున్సిపాలిటీకి కేటాయించిన విషయాలు ఎక్కడ ఉన్నాయో అధికారులు తమ దృష్టికి తీసుకురాకుండా వాటిని అమ్ముకున్నట్లు వారు ఫిర్యాదులు పేర్కొన్నారు. ప్రస్తుత పాలకులు అధికార బలంతో వీటిపై విచారణ జరపకుండా, ఇప్పుడైనా మేలుకొని వెంచర్లు, 10 శాతం భూముల వివరాలు పై విచారణ జరిపి, వీటిపై అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ మున్సిపల్ పాలకవర్గం డిమాండ్ చేస్తుంది.

- అధికారులపై చర్యకు మున్సిపాలిటీ కౌన్సిలర్ల డిమాండ్.
- జిల్లా కలెక్టర్ కార్యాలయం లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు



బాన్సువాడ మున్సిపాలిటీలో వెంచర్ల అనుమతిలో టౌన్ ప్లానింగ్ అధికారితో పాటు, మున్సిపాలిటీ కమిషనర్లు, సిబ్బంది పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు బాన్సువాడ మున్సిపాలిటీ పాలకవర్గం ఆరోపించింది. ఈ విషయంలో రాష్ట్ర ఉన్నత అధికారులు సమగ్రంగా విచారణ జరిపితే అసలైన విషయాలు బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయని పాలకవర్గం ఫిర్యాదులు పేర్కొంది.

# అప్పుల బాధతో ఒకరు మృతి

**నస్రుల్లాబాద్, సూర్య మేజర్ న్యూస్, మే 24 :**

కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలంలోని మైలారం గ్రామ పంచాయతీ పరిధిలో గల కొచ్చేర మైసమ్మ ఆలయం సమీపంలో బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కురుపాటి శేఖర్ (45) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ లావణ్య తెలిపారు. ఆమె తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన శేఖర్ వృత్తిరీత్యా ట్రాక్టర్ డ్రైవర్ అని, అప్పుల బాధలు,ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని వేంపల్లి గ్రామంలో ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. దీంతో గురువారం తిమ్మాపూర్ గ్రామానికి విచ్చేసిన ఆయన రాత్రి కొచ్చేర మైసమ్మ ఆలయ సమీపంలోకి వెళ్లి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ వివరించారు. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించామని ఆమె పేర్కొన్నారు. మృతుడి భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారని ఆమె తెలిపారు.

# ఎల్లారెడ్డి లో శుభ్రం చేయని మురుగు కాలువలు..!

## -దోమలతో ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు..!

**ఎల్లారెడ్డి, 24 మే, సూర్య మేజర్ న్యూస్ :**

ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని రెండవ వార్డులో మురికి కాలువ నిర్మాణం అసంపూర్తిగా వదిలేయడంతో దాని వలన ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థ పదార్థాలు ఆగడంతో మురికి నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు, ఈగల తో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నామని అంటున్నారు. పూర్తి చేయకుండా వదిలేసిన మురికి కాలువ నిర్మాణాన్ని పూర్తి చేసి, మునిసిపల్ అధికారులు మురికి కాల్వల శుభ్రం చేయించి వార్డు ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.



సూర్య

శనివారం, 25 మే , 2024

# రైతులకు సకాలంలో జీలుగు విత్తనాలు అందించాలి..!

## - ఎంపీపీ మాధవి బాలరాజు గౌడ్

**ఎల్లారెడ్డి, మే 24, సూర్య మేజర్ న్యూస్ :**



ఎల్లారెడ్డి మండలంలోని మత్తమాల, వెల్లుట్ల, ఎల్లారెడ్డి సహకార సంఘాలకు ఇప్పటి వరకు జీలుగు విత్తనాలు, పెద్ద జనుము విత్తనాలు రాకపోవడం తో రైతులు ఆందోళన చెందు తున్నారు. ఆయా సొసైటీలకు రైతులు రోజు వచ్చి అడిగి వెను దిరిగిపోతున్నారు. సకాలంలో జీలుగు పెద్ద జనుము విత్తనాలు రాకపోవడంతో రైతులు ప్రభుత్వంపై మండి పడు తున్నారు. జీలుగు విత్తనాల కొరకు ఆయా సహకార సంఘాలలో రైతన్నలు పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటివరకు ఎల్లారెడ్డి సొసైటీకి తప్పించి మిగతా సొసైటీలకు జీలుగు పెద్ద జనుము విత్తనాలు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందు తున్నారు. కొంతమంది రైతులు స్థానిక ఎంపీపీ మాధవి బాలరాజ్ గౌడ్ విత్తన పంపిణీలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహి స్తుందని ఎంపీపీ బాల మాధవి బాలరాజ్ గౌడ్ తో రైతులు మొరపెట్టుకున్నారు, దాంతో ఎంపీపీ మాధవి బాలరాజ్ గౌడ్ రైతులతో మాట్లాడి త్వరలోనే వచ్చే విధంగా ఏర్పాటు చేస్తానని అన్నారు. రైతులకు సకాలంలో జీలుగు పెద్ద జనుము విత్తనాలు అందించాలని ఆమె కోరారు.

**ఉత్తరప్రదేశ్ రాజస్థాన్ నుండి జీలుగు విత్తనాలు రావాలి, పెద్ద జనుము నంద్యాల నుండి రావాలి. రాగానే సొసైటీల ద్వారా జీలుగు పంపిణీ చేస్తాం.**
**– ఎల్లారెడ్డి ఇంచార్జ్ ఏవో అనిల్ కుమార్.**

ఇంచార్జ్ ఏవో అనిల్ కుమార్ ను **"సూర్య మేజర్ న్యూస్"** చర వాణి లో వివరణ కోరగా ఎల్లారెడ్డి మండలానికి వెయ్యికింటల జీలుగు పెద్ద జనుము కావలని ఎల్లారెడ్డి ఏ డి ఏ, జిల్లా వ్యవసాయ అధికారులకు అలాట్మెంట్ 1000 క్వింటాళ్ల జిలుగు. పెద్ద జనుము విత్తనాలు కావలని జిల్లా వ్యవసాయ అధికారులకు లెటర్ పంపించామని తెలిపారు. ఎల్లారెడ్డికి వంద కింటల జీలుగు 20 క్వింటల్ల పెద్ద జనుము, వెల్లుట్ల 60 కింట్ల జిలుగా, 20 కింట్ల జనుము, మత్త మల సొసైటీకి 40 కింటాలు జిలుగ 20 క్వింటాళ్ల, జనుము మూడు నాలుగు రోజుల్లో



వస్తుందని తెలిపారు. ఎల్లా రెడ్డికి అదనంగా జీలుగు విత్తనాలు కావాలని కోరగా 200 కింటలకు అలర్ట్మెంట్ ఇచ్చా మని తెలిపారు. ఉత్తర ప్రదేశ్ రాజస్థాన్ రాష్ట్రాల నుండి రావాలని అందుకే ఆలస్యం అవుతుందని తెలి పారు. ఇంకా మూడు, నాలుగు రోజుల్లో జీలుగు విత్తనాలు వస్తుందని రాగానే ఆయా సొసైటీల ద్వారా పంపిణీ చేస్తామని రైతులు ఎలాంటి ఆందోళన చెంద వద్దని ఆయన తెలియజేశారు. ఎల్లారెడ్డి మండలానికి 1000 కింటల్ల జీలుగు, పెద్ద జనుము విత్తనాలకు ఆర్డర్ పెట్టామని ఇప్పటివరకు 100 కింటల్లా జిలుగు మాత్రమే వచ్చాయని మిగతా విత్తనాలు నాలుగురోజులలో వస్తాయని అంతవరకు ఓపికతో ఉండాలని వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ తెలిపారు. ,నాలుగు రోజుల్లో వస్తాయని రాగానే వెల్లుట్ల సొసైటీ, మత్తా మాల సొసైటీ ద్వారా పంపిణీ చేస్తామని తెలిపారు.

# వైభవంగా బద్ది పోచమ్మ ఉత్సవాలు

**సదాశివనగర్, మే 24, సూర్య మేజర్ న్యూస్ :**



సదాశివనగర్ మండలం అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామంలోని బద్ది పోచమ్మ 13వ వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో భక్తులు కుంకుమార్చనలు, యజ్ఞం, ఓడి బియ్యం, గౌరీ గణపతి పూజ పుణ్యవచనం, నవగ్రహ పూజ, అభిషేకం, యజ్ఞం,పూర్ణహుతి, కుంకుమ పూజ,శాంతి పూజ, ధూప దీప నైవేద్యం,శాంతి కళ్యాణం,ఒడి బియ్యం,బోనాలు కార్యక్రమాలు నిర్వహించారు.మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం బోనాల గృహప్రవేశం, ఈనెల 26న అమ్మవారి శాంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామ ప్రజలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# దుర్గామాతకు ఘనంగా ఎడ్లబండ్ల ప్రదర్శన

**లింగంపేట్, మే 24, సూర్య మేజర్ న్యూస్ :**

లింగంపేట్ మండలంలోని ఐలాపూర్ గ్రామంలో శుక్రవారం గ్రామస్తులు ఘనంగా ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. గ్రామంలోని వివిధ కుల సంఘాలు వారు ఎడ్లబండ్లు కట్టి దుర్గామాత ఆలయం చుట్టూ ఎడ్లబండ్లతో ప్రదర్శన చేశారు.ఎలాంటి గొడవలకు తావివ్వకుండా గ్రామ పెద్దలు ఆలయ కమిటీ సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. దుర్గామాతకు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చు కున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు తుమ్మలపల్లి శ్రీనివాస్ రెడ్డి,వెంకట్ గౌడ్,సంతోష్ రెడ్డి,కమ్మరి వెంకటేశం,గ్రామ పెద్దలు,గ్రామస్తులు యువకులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



**భిక్కనూరు, మే 24, సూర్య మేజర్ న్యూస్:**

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శు క్రవారం ఎస్సై సాయి కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ కళాజాత బృంద సభ్యులు సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎలాంటి అపరిచిత ఫోన్ కాల్స్ నమ్మి మోసపోవద్దని, సెల్ ఫోన్ లలో పనికిరాని యాప్స్ డౌన్లోడ్ చేసుకోవద్దని వివరించారు. అలాగే విద్యార్థులు చెరువుల వద్దకు ఈతకు వెళ్లవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కళాబృంద సభ్యులు ప్రభాకర్, సాయిలు, శేషారావు, షీ టీం బృంద సభ్యులు భూమయ్య, రాజేందర్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్ని రకాల వడ్లకు బోనస్ చెల్లించాలి



**బిక్కనూర్, మే 24, సూర్య మేజర్ న్యూస్:**

రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన అన్ని రకాల వరి ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల చొప్పున బోనస్ చెల్లించాలని మండలంలోని రామేశ్వర్ పల్లి సొసైటీ చైర్మన్ నాగర్సి భూమిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు అన్ని రకాల వరి ధాన్యానికి బోనస్ చెల్లించాలని, కేవలం సన్న రకం వడ్లకు బోనస్ ప్రకటించడం సిగ్గుచేటని, రాష్ట్రంలో రైతులు 90 శాతం దొడ్డు రకం వడ్లు పండిస్తారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే రైతులు పండించిన అన్ని వడ్లకు క్వింటాలకు 500 రూపాయల చొప్పున బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంతంపల్లి సింగిల్ విండో సొసైటీ చైర్మన్ వలకొండ వెంకటరెడ్డి, పెద్ద మల్లారెడ్డి సొసైటీ చైర్మన్ బాలగోని రాజా గౌడ్ ఉన్నారు.

# రసాభాసాగా సాగిన మండల సర్వసభ్య సమావేశం


బిక్కనూర్ మే 24 సూర్యా మేజర్ న్యూస్:
మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ గాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు అడిగిన సమస్యలకు అధికారులు సమాధానం చెప్పారు. చివరిగా రామేశ్వర్ పల్లి ఎంపీటీసీ మద్ది చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ గస బి ఆర్ ఎస్ పాలనలో అకాల వర్షానికి ఎప్పుడూ నష్టపరిహారం చెల్లించలేదని, ఇటీవల మండలంలో కురిసిన అకాల వర్షానికి ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎకరానికి పదివేల రూపాయల చొప్పున నష్టపరిహారాన్ని చెల్లించడం జరిగిందని, ఆగస్టు 15వ తేదీ లోపు రైతులకు రుణమాఫీ కాంగ్రెస్ పార్టీ చేస్తుందని, రుణమాఫీ చేయకుంటే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని అనడంతో మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దాయారి సాయి రెడ్డి కలుగజేసుకొని బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని బిఆర్ఎస్ పార్టీని నిందించడం తగదని అనడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో సాయి రెడ్డి చేతుల్లో నుండి మైక్ సెట్ ను చంద్రకాంత్ రెడ్డి లాక్కోవడంతో బి ఆర్ ఎస్ ప్రజా ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ కలుగజేసుకొని ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున సమావేశ మందిరంలో ఎలాంటి వాగ్వివాదం చేయకూడదని వారించడంతో వివాదం సద్దుమణిగింది. చివరి సమావేశం రసాభాసగా ముగియడంతో కాసేపు ఉదిత్త పరిస్థితి నెలకొంది. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుడిసె యాదగిరి, డిసిసిబి డైరెక్టర్ లింగాల కృష్ణ గౌడ్, ఎంపీటీసీలు మోహన్ రెడ్డి, సాయ గౌడ్, ఉప్పల బాబు, సువర్ణ ప్రభాకర్, లీలావతి బాలా గౌడ్, చంద్రకళ రాములు, మంజుల సంజీవరెడ్డి, మీనా దుర్గ బాబు, యశోద కిష్టయ్య, మంజుల రాములు, సొసైటీ చైర్మన్లు గంగల భూమయ్య, నాగర్తి భూమిరెడ్డి, బాలగౌని రాజా గౌడ్, వలకొండ వెంకటరెడ్డి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.





## సొసైటీలలోని ఫర్టిలైజర్ స్టాక్, సీడ్ స్టాక్ ను తనిఖీ చేసిన ఏవో

సదాశివనగర్, మే 24, సూర్య మేజర్ న్యూస్ :
సదాశివనగర్, పద్మాజీ వాడి, ఉత్నూర్ గ్రామాలలో గల సొసైటీలలోని ఫర్టిలైజర్ స్టాక్ మరియు సీడ్ స్టాక్ ను మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి తనిఖీ చేశారు. రైతులకు ఈపాస్ మిషన్ మరియు ఆధార్ ఆధారంగా ఎరువులు అమ్మాలని సూచించారు. రైతులకు విత్తనాలు అమ్మేటప్పుడు రైతుల వివరాలు రిజిస్టర్ నమోదు చేయాలని సూచించారు.



## మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

### మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ

కామారెడ్డి అర్బన్, సూర్య మేజర్ న్యూస్, మే 24 :
కామారెడ్డి జిల్లా కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందు ప్రియా అన్నారు. కామారెడ్డి పురుపాలక సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు వార్డు సమస్యలపై చైర్పర్సన్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సమస్య పరిష్కారానికి ధనవంతు కృషి చేస్తానన్నారు. అభివృద్ధి పనులు విషయంలో నిధులను కొరత అధిగమిస్తామన్నారు. ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులు వస్తే తప్పకుండా అభివృద్ధికి ప్రాధాన్యమిస్తామన్నారు. అభివృద్ధి పనుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకొని ముందుకు వెళ్తామన్నారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, ఇంజనీరింగ్ అధికారులు, ప్రణాళిక సిబ్బంది, అధికారులు, కామారెడ్డి పట్టణ కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## విత్తన మేళాకు తరలిన జిల్లా రైతులు

నిజాంసాగర్, సూర్య మేజర్ న్యూస్, మే 24 :
హైదరాబాదులోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రైతు మేళా కార్యక్రమానికి నిజాంసాగర్ మండలం నుంచి పలువురు రైతులు వెళ్లారు. ఈ కార్యక్రమంలో విత్తనాల ఎంపిక అధిక దిగుబడులు సాగు విధానం తదితర అంశాలపై వివరించారు. దీంతో పాటు కొత్త రకమైన వంగడాలు వ్యవసాయ సాగులో వినూత పద్ధతులు వంటి అంశాలపై ప్రదర్శన కొనసాగించారు. గ్రామానికి నిజాంసాగర్ మండలం నుంచి సీనియర్ నాయకులు దుర్గారెడ్డి, అచ్చంపేట సొసైటీ చైర్మన్ నరసింహారెడ్డి, మండల మాజీ రైతుబంధు కన్వీనర్ మహేందర్ కుమార్, వైస్ ఎంపీపీ మనోహర్, మాజీ సర్పంచ్ల సంఘం అధ్యక్షులు రమేష్ గౌడ్, నాయకులు శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## కరెంట్ షాక్ తో పాడి ఆవు మృతి

సదాశివనగర్, మే 24, సూర్య మేజర్ న్యూస్ :
సదాశివనగర్ మండలం అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన పయ్యావుల శ్రీను రైతుకు చెందిన పాడి ఆవు కరెంటు వైర్ తీగలు తెగిపడి మృతి చెందిందని బాధితుడు తెలిపారు. వ్యవసాయం చేసుకునే పొలంలో అవును ఉదయం పశుగ్రాసం కోసం కట్టేశారు. ఆవు మృతి చెందడంతో కన్నీరు మున్నీరయ్యారు. ఆవు విలువ 70 వేల వరకు ఉంటుందని తెలిపారు. బాధితుడు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. విద్యుత్ అధికారులు స్పందించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.



## ప్రశాంతంగా ముగిసిన పాలిసెట్ -2024 పరీక్ష

కామారెడ్డి అర్బన్, సూర్య మేజర్ న్యూస్, మే 24:
కామారెడ్డి జిల్లా కేంద్రంలో పాలిటెక్నిక్ కాలేజీలో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్ ప్రవేశ పరీక్ష శుక్రవారం ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు పరీక్ష కేంద్రాల్లో 1200 మంది, సందీపని డిగ్రీ కళాశాలలో 850, ఎస్ ఆర్ కె డిగ్రీ కాలేజీలో 251 మంది రాసారు. విద్యార్థులు 9 గంటల నుంచి పరీక్ష కేంద్రాల వద్ద సందడి నెలకొంది. వివిధ గ్రామాల నుంచి తల్లిదండ్రులతో వచ్చారు.